క్లుప్తంగా

రేపు ఉచిత ధ్యాన శిక్షణ శిబిరం

నయీంనగర్: వాయుపుత్ర ధ్యాన మందిరం కాపువాడ ఆధ్వర్యంలో ఆదివారం ఒకరోజు ఉచిత ధ్యాన శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కె.రాంమూర్తి, ఎం.రవీందర్ తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉదయం 10నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రాండ్ మాస్టర్ కె.రామిరెడ్డి శిక్షణ ఇస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు సంఘం సమావేశం

ఖిలా వరంగల్: అన్నపూర్ణ పరపతి సంఘం 23వ సర్వసభ్య సమావేశాన్ని వరంగల్ ఫోర్ట్ రోడ్డులో అన్నపూర్ణ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు బిట్ల సుధాకర్, బండి కోటేశ్వర్‌రావు, ఎనబోతుల సాంబయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులందరు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

కేవీ ఉపాధ్యాయుడికి ఎంఎఫ్ హుస్సేన్ అవార్డు



కాజీపేట అర్బన్: ఇండియన్ ఆర్ట్ సొసైటీ ఎంఎఫ్ హుస్సేన్ అవార్డును కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలోని ఆర్ట్ టీచర్ అనబత్తుల వెంకన్న అందుకున్నారు. ఈమేరకు వెంకన్నను పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ సుభాషిణి, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



దేశాయిపేట: వరంగల్ దేశాయిపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30మంది గర్భిణులకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ మెడికల్ హెల్త్ కమిటీ సభ్యురాలు డాక్టర్ హరిరమాదేవి మాట్లాడుతూ గర్భం దాల్చిన సమయం నుంచి శిశువుకు జన్మనిచ్చేంత వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాలరావు, క్లబ్ ప్రతినిధులు రాజగోపాల్, వేణుగోపాల్, కృష్ణమోహన్, వెంకటనాగరాజు, వైద్యనాథ్, రమేష్‌బాబు, రాజయ్య, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వం న్యాయం చేయాలి

వరంగల్: వరంగల్ జిల్లా రాంకీ విల్లాలో నివాసముంటున్న బీసీ నేత, రాజకీయ నాయకుడు నవీన్‌రాజు తనకు చేస్తున్న అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి న్యాయం చేయాలని దేశాయిపేట లక్ష్మీ టౌన్‌షిప్‌కు చెందిన బాధితురాలు అంజనీదేవి విజ్ఞప్తి చేశారు. ఎల్బీనగర్‌లోని డీసెంట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. నవీన్‌రాజు గతంలో తనపై అత్యాచారానికి పాల్పడిన సమయంలో స్థానిక నేత కొండా సురేఖకు వివరించగా నవీన్‌రాజ్‌తో తన వివాహం జరిపిస్తామని, లైఫ్ సెటిల్ చేస్తానని హామీ ఇచ్చి తన వద్ద ఉన్న డాక్యుమెంట్లను ఆమె తీసుకున్నారని గుర్తుచేశారు. అతడిపై అత్యాచారం కేసు కింద ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయించారని తెలిపారు. నవీన్‌రాజ్ తన పలుకుబడితో సాక్ష్యాలు లేకుండా చేసి కేసు లేకుండా చేసుకున్నాడని తెలిపారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా గెలిచిన సురేఖను కలిసి ఇప్పుడైనా న్యాయం చేయాలని కోరగా రేపు మాపు అంటూ తిప్పించుకుంటున్నారని అంజనీదేవి తెలిపారు. గత నెల 12వ తేదీన రాంనగర్‌లోని సురేఖ నివాసానికి వెళ్లి అడుగగా తనను నానా భూతులు తిట్టి పంపివేసినట్లు వాపోయారు. విషయాన్ని పోలీసుకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల నిరసన

చెన్నారావుపేట : సుమారు 11 ఏళ్లుగా ఒకే చోట పని చేస్తున్న తమను బదిలీ చేయాలని కోరుతూ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో శుక్రవారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ శేఖర్ మాట్లాడారు. ఈ ఏడాది జూన్, జులైలో బదిలీ చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టడం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమ అన్ని సమస్యలనూ పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యను అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, రాజ్‌కుమార్, అనిల్, శృతి, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, రవిశంకర్, భవానీ, కుమారస్వామి, సీతయ్య, వీరబాబు, మల్లేషం,భాగ్యలక్ష్మి, సంతోశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని నర్సక్కపల్లిలో నాట్లు వేస్తున్న కూలీలు



జోరుగా వరినాట్లు..

- వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం
- గ్రామాల్లో కూలీల కొరత
- ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న రైతన్నలు
- మండలంలో 6,500 హెక్టార్లలో వరిసాగు

నడికూడ : ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు, చెరువుల్లో వరదనీరు భారీగా చేరడంతో రైతన్నలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు మండలంలోని రైతులు రెండు నెలలు ఆలస్యంగా పంటసాగు పనులు చేపట్టిప్పటికీ ప్రస్తుతం నాట్లు జోరుగా సాగుతున్నాయి. రైతులందరూ ఒకేసారి వ్యవసాయ పనులు మొదలు పెట్టడంతో గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడింది. దీంతో రైతులు మండలంలోని వివిధ గ్రామాల నుంచి కూలీలను తీసుకొచ్చి పనులు ముమ్మరం చేస్తున్నారు. ఆలస్యమైతే నారు ముదిరిపోయే అవకాశం ఉండడంతో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చుట్టుపక్కల గల మెట్ట ప్రాంతం నుంచి కూలీలను నాట్లు వేసేందుకు ఆశ్రయిస్తున్నారు. మండల పరిధిలో సుమారు 6,500 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు కానుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో పరకాల, హుజూరాబాద్, అంబాల, హసన్‌పర్తి, తదితర ప్రాంతాల నుంచి కూలీలను ఆటోలు, ట్రాలీల్లో తరలిస్తున్నారు. ఒక్కొక్క కూలీకి రూ. 350 నుంచి



నాట్లు వేసేందుకు ట్రాలీలో వెళ్తున్న కూలీలు

రూ.400 తో పాటు అదనంగా ఆటో చార్జీలు ఇస్తూ నాట్లు వేయిస్తున్నారు. ఎకరం పొలంలో నాటు వేసేందుకు 13 నుంచి 15 మంది కూలీలు అవసరం కాగా రూ.5 వేల నుంచి రూ.5,250 వరకు సదరు రైతులో మాట్లాడుకుని వరి నాట్లు వేస్తున్నారు. అలాగే విత్తనోత్పత్తికి సంబంధించిన సీడ్ రకానికి 6 వేల వరకు రైతులతో ఒప్పందం కుదుర్చుకొని కూలీలు నాటు వేస్తున్నారు. దీంతో మండల వ్యాప్తంగా వరినాట్ల జోరుగా కొనసాగుతోంది.

కూలీలకు పొంచిఉన్న ప్రమాదం

పొట్టకూటి కోసం దినసరి కూలీ చేసుకునేందుకు కూలీలు ప్రమాదపుటంచున ప్రయాణం కొనసాగిస్తున్నారు. నలుగురు వెళ్లాల్సిన ఆటోలో 15 మందితో ప్రయాణం చేస్తున్నారు. ఆటోలో దాదాపు 30 మంది వరకు ప్రయాణిస్తున్నారు. వీరి ప్రయాణంలో ప్రమాదం జరిగితే భారీ ప్రాణనష్టం సంభవిస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పొలం దున్నుతున్న రైతు

పెట్టుబడి పెరుగుతోంది



నాట్లు వేసేందుకు కూలీల కొరత ఏర్పడింది. దీంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి కూలీలను తీసుకురావడంతో అదనంగా రూ.350 నుంచి రూ.400 వరకు చెల్లించాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడి పెరుగుతోంది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని దేవుడిని వేడుకుంటున్నాం.

- వరికెల కిషన్‌రావు, రైతు, నర్సక్కపల్లి

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

- రూ. 50 వేల ఆస్తి నష్టం



కాలిపోయిన సామగ్రి



దగ్ధమైన సామగ్రిని పరిశీలిస్తున్న ఎమ్మార్వో శరత్‌కుమార్

శాయంపేట : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగి సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని జోగంపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మార్క భద్రయ్య దంపతులు కూలి పనుల నిమిత్తం ఇంటికి తాళం వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో నుంచి మంటలు వ్యాపించాయి. గమనించిన చుట్టుపక్కల వారు మంటలను ఆర్పివేశారు. గ్రామస్తులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లి చూడగా టీవీ, రిఫ్రిజిరేటర్, రెండు కుట్టుమిషన్లు, పుస్తకాలు, నిత్యవసర వస్తువులు, రెండు క్వింటాళ్ల బియ్యం, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మార్వో శరత్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సమారు 50 వేల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. కాగా భద్రయ్య ఏడాదిన్నర క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ పరిస్థితిలో ఆస్తి నష్టం జరగడంతో బాధితులు బోరున విలపించారు. వస్తువున్నీ కాలిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

ఆత్మకూరు : ఆగస్టు 1న జరిగే ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆటో డ్రైవర్ల యూనియన్ (టీపీడీయూ) జిల్లా అధ్యక్షుడు గొని రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు హాజరై మాట్లాడారు. ఆటో డ్రైవర్లు ఐక్యంగా ఉండాలన్నారు. సమిష్టి కృషితో ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామకమిటీ అధ్యక్షుడు బయ్య కుమారస్వామి, మత్స్యసంఘం చైర్మన్ తిరుపతి, ఆత్మకూరు గ్రామ అధ్యక్షుడు పోగాకుల రాజు, వల్లాల నవీన్‌గౌడ్, కిరీటి, కోగిల సదానందం, మంద సురేశ్, పైడి, కేదారితో పాటు యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

బురదరోడ్డుపై నాట్లు వేసిన సీపీఎం నాయకులు



రోడ్డుపై నాట్లు వేస్తున్న సీపీఎం నాయకులు

ఐనవోలు : మండలంలో పదిరోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లన్నీ బురదమయం కావడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని సీసీ రోడ్లు నిర్మించాలని సీపీఎం మండల పార్టీ కార్యదర్శి కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. వివిధ గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. గుంతలుగా ఉన్న రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు, డ్రైయినేజీలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మడిగె నాగరాజు, కార్యదర్శి కొంకాల నారాయణరెడ్డి, ధీకొండ ఉప్పలయ్య, బొమ్మకంటి యాకయ్య, జక్కుల నర్సయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభను విజయవంతం చేయాలి



నర్సంపేట : ఖమ్మంలో ఈనెల 28న ఎస్ఆర్ గార్డెన్‌లో తలపెట్టిన రాయల చంద్రశేఖర్ సంతాప సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి కోరారు. అశోక్‌నగర్, నర్సంపేట, సర్వాపురం, మాధన్నపేట, తదితర గ్రామాల్లో ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అడ్డూరి రాజు అధ్యక్షతన చంద్రశేఖర్ చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూరి మాట్లాడారు. పార్టీలో చంద్రశేఖర్ క్రియాశీలక బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దార లింగన్న, రవి, చొప్పరి పైడి, నర్సింహస్వామి, ఇజ్జగిరి కొమురయ్య, సుధాకర్, వియంగాల సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



అవగాహన కల్పిస్తున్న ధర్మసాగర్ సీఐ మహేందర్

వేలేరు (ధర్మసాగర్) : గంజాయి, మత్తు పదార్థాలతో జరిగే అనార్థాలపై ధర్మసాగర్ పోలీస్‌లు రాంపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ సీఐ మహేందర్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిస కావదన్నారు. డ్రగ్స్, గంజాయికి బానిసైతే జీవితం నాశనం అవుతుందని అన్నారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, సేవించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఆడబిడ్డల అభ్యున్నతే ధ్యేయం

హన్మకొండ చౌరస్తా: మహిళా అభ్యున్నతే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయమని, ఇందిరమ్మ రాజ్యంలో రానున్న రోజుల్లో మహిళా సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో శుక్రవారం 51మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొదటిసారి తమ నియోజకవర్గంలో చెక్కులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నిర్లక్ష్యం వలన వరంగల్‌కు నిధులు రాలేదని బీజేపీ నాయకులు అనడం సిగ్గుచేటని ఆయన అన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని

జేఎన్ఎస్‌లో క్రీడాకారుల సంబురాలు



సంబురాల్లో జంగా, కోచ్‌లు, క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడాభివృద్ధికి రూ.325 కోట్ల నిధులు కేటాయించడంపై క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఒలింపిక్స్ సంఘం ఆధ్వర్యంలో హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవెర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడారు. హనుమకొండ డీవైఎస్ఓ అశోక్‌కుమార్, ఒలింపిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి కైలాస్‌యాదవ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు రాజేశ్వర్‌రావు, సారంగపాణి, డీఎస్ఏ కోచ్‌లు శ్రీమన్నారాయణ, నవీన్‌కుమార్, మహ్మద్ అఫ్జల్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, ప్రశాంత్, విష్ణువర్ధన్, బత్తిని జీవన్‌గౌడ్, నరేందర్, రాజు, కూరపాటి రమేష్, పలు క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని పూర్తిచేయాలి



శాయంపేట : మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిన ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను పునఃప్రారంభించి వెంటనే పూర్తిచేయాలని దళిత సంఘం నాయకుడు మారేపల్లి సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే వెంకటమరణారెడ్డి నిధులు మంజూరు చేయగా సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులు చేపట్టి మధ్యలోనే వదిలేసినట్లు తెలిపారు. దీంతో సమీపంలోని రైతులు వరిగడ్డికి వినియోగించుకుంటున్నారని తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పందించి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులను పూర్తి చేసి అందుబాటులోకి ఈ సందర్భంగా తీసుకురావాలని కోరారు.

బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు అన్యాయం జరిగిందని మైలారం మాజీ సర్పంచ్ అరికిళ్ల ప్రసాద్ విమర్శించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రుణమాఫీ విషయంలో అంకెల గారడీతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో భూపాలపల్లి నియోజకవర్గానికి మొండిచెయ్యి చూపిందన్నారు.

మృతదేహానికి నివాళి



వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన జినుకల రాజకొమురయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. వారివెంట మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మండల యూత్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్, మాజీ ఎంపీటీసీ సంపత్ నాయకులు రణధీర్ రెడ్డి, ప్రశాంత్, హరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించండి



ఐనవోలు : కాజీపేట నుంచి వయా వెంకటాపూర్ మీదుగా ఐనవోలుకు వెళ్లే బస్సు సర్వీసును పునరుద్ధరించాలని వెంకటాపూర్ గ్రామానికి చెందిన పలువురు రీజనల్ మేనేజర్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఇదివరకు వెంకటాపూర్‌కు ఉదయం రెండుసార్లు, సాయంత్రం రెండుసార్లు టీజీఎస్ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేదన్నారు. కొద్ది రోజులుగా బస్సు రావడం లేదని, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. పాత సర్వీసును యథావిధిగా పునరుద్ధరించాలని ఆర్టీసీ అధికారులకు అందించిన వినతిలో కోరారు. గ్రామస్తులు చిరంజీవి, కృపాకర్, సునీత, కృష్ణ, శ్రీదేవి, లలిత, మాధవి, కవిత, వైష్ణవి, రాధ, భాగ్య, రజియా పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఐనవోలు : ఐనవోలు ఎంపీపీఎస్ పాఠశాలలో విధులు నిర్వర్తించి పదోన్నతి పొంది బదిలీ అయిన ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, లక్ష్మయ్య, మహేందర్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. తమకు గౌరవాన్ని, గుర్తింపు తెచ్చిన ఈ పాఠశాలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని బదిలీ ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి మంచి మార్కులు సాధించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, మధుకర్, మహేందర్ రెడ్డి, సారయ్య, లక్ష్మి, విజయ, రేవతి, భవన్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

హన్మకొండ: విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి విమర్శించారు. ఈమేరకు భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్ నాయక్, నగర కార్యదర్శి రాకేష్, నాయకులు రాజేష్, శ్రీకాంత్, హరీష్, సంపత్, శ్రీనాథ్, విజయ్, హరీష్, లక్ష్మణ్, లలిత, అనూష, స్వాతి పాల్గొన్నారు.

కేయూ క్యాంపస్: విద్యారంగానికి బడ్జెట్‌లో ప్రభుత్వం మొండిచేయి చూపిందని ఆరోపిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట రోడ్డుపై శుక్రవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రాచకొండ రంజిత్, నాయకులు వెంకట్, మహేష్, అరుణ్, పాషా పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించకుండా తక్కువగా కేటాయించారని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ జనరల్ సెక్రటరీ మహేష్ పాల్గొన్నారు.

నోటీసులపై ఎంహెచ్‌నగర్ గుడిసెవాసుల నిరసన

వరంగల్: గ్రేటర్ వరంగల్ 13వ డివిజన్ ఎంహెచ్‌నగర్ కాలనీ వాసులకు జారీ చేసిన నోటీసులపై సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కాశిబుగ్గ ఏరియా కార్యదర్శి మహమ్మద్ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ 2007లో 13వ డివిజన్ దేశాయపేట, ఎంహెచ్‌నగర్ సర్వే నంబర్ 308లో నివేశ స్థలాలను వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో పేదలకు అప్పగించి పట్టాలు ఇచ్చారని గుర్తుచేశారు. 4 రోజుల క్రితం మున్సిపాలిటీ అధికారులు నోటీసులు జారీ చేశారని వాపోయారు. 21ఏళ్లుగా ఇళ్లు కట్టుకొని నివసిస్తున్న కుటుంబాలకు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దూడం సంపత్, పెండ్యాల బాబు, సాబీర్, నాగరాజు, మహేందర్, నాగుల స్వరూప, కొడూరు రజిత, సాయినాథ్, లక్ష్మి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గుడిసెవాసులు

ప్రేరణ జాతీయ స్థాయి శిక్షణకు ఎంపిక



విద్యారణ్యపురి: గుజరాత్‌లోని వాగనగర్‌లో ఆగస్టు 4నుంచి 10వ తేదీ వరకు జరగనున్న అఖిల భారత జాతీయ స్థాయి ప్రేరణ శిక్షణకు హనుమకొండ జిల్లా నుంచి ఎంపికైన ఇద్దరు విద్యార్థులను హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై శుక్రవారం అభినందించారు. పంథిని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన విద్యార్థి కర్ణకంటి అక్షయ్‌రామ్, కాజీపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన గండి వర్ష ఎంపికయ్యారని జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పంథిని పాఠశాల హెచ్ఎం ఆనందం, కాజీపేట బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు సునీత, రవీందర్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.